క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ప్రసన్నకు పూలమొక్క ఇస్తున్న నాయకులు

కోవూరు : మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకు మార్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమించిన సందర్భంగా నెల్లూరులోని వారి నివాసంలో కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన పార్టీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు మేకల మోషే, రొండ్ల చందు, మోచర్ల ఏడుకొండలు, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకిసేవ జరిగింది.

సినీ గాయని సునీత సందడి



ఫెస్ట్‌ను వీక్షిస్తున్న గాయని సునీత

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల్లో జరిగిన టెక్నికల్ ఫెస్ట్‌లో ప్రముఖ సినీ గాయని సునీత సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా బోధన ఉండాలన్నారు. పిల్లలతో గడిపేందుకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, గౌరవాధ్యక్షురాలు శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఏఓ కె.గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

మెరిట్, రోస్టర్ విధానంలో పదోన్నతులు ఇవ్వాలి

నెల్లూరు(అర్బన్) : మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో మాత్రమే ప్రమోషన్లు ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు బీటీఏ(బహుజన టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణి సుబ్బు, ప్రసాద్‌లు మాట్లాడారు. ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఉపాధ్యాయులకు మేలు జరగాలంటే ప్రస్తుతం కొనసాగిస్తున్న విధానమే సరైందన్నారు. అయితే ప్రభుత్వం ఆ పద్ధతికి తిలోదకాలు ఇచ్చేందుకు పూనుకోవడం దారుణమన్నారు. నేడు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెరిట్ లిస్టులు తయారు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలా చేసిన మెరిట్ లిస్టును తక్షణమే రద్దు చేసి సీనియారిటీ జాబితాను సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, లక్ష్మయ్య, బీసీ చెంచయ్య, చిన్నయ్య, ఎజ్రా, శ్రీనివాసులు, పవన్‌కుమార్, రాజశేఖర్, రాంబాబు, నరసింహులు, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జిల్లాలో అశాంతి

- అప్రమత్తమైన పోలీస్ శాఖ
- జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత జిల్లాలో క్రమేపీ అశాంతి నెలకొంటోంది. వరుస హత్యలు, హత్యాయత్నాలు జిల్లా వాసులను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ప్రజలు బయట తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై గత ప్రభుత్వ హయాంలో ఉక్కుపాదం మోపడంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేరాలు పెరుగుతున్నాయి. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను అధికార పార్టీ నేతలు ప్రోత్సహిస్తుండటంతో వారిపై పోలీసుల పర్యవేక్షణ తగ్గింది. ఆరు రోజుల వ్యవధిలో నగరంలో మూడు హత్యలు, హత్యాయత్నాలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో రెండు హత్యలు బుధవారం రాత్రి చోటుచేసుకోవడం జిల్లా వ్యాప్తంగా కలకలం రేకెత్తించింది. దీంతో పోలీస్ యంత్రాగం అప్రమత్తమైంది. నేరాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలను ఎస్పీ సౌజన్య ఆదేశాల మేరకు గురువారం రాత్రి చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రౌడీషీటర్లు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను నిర్దీత వేళల్లోనే మూసేసేలా చర్యలు చేపట్టారు. రోడ్లపైకి అర్ధరాత్రి వస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి.

మేజర్ పంచాయతీలో వెతుకులాట

- చిరునామాల కోసం వెతలు
- మున్సిపాలిటీకి చేరువలో ఉన్నా పాత పద్ధతులే..
- ఇబ్బందులు పడుతున్న జనం
- కొండగుర్తులే దిక్కు
- ఇంటి నంబర్లు లేకపోవడమే కారణం



పట్టణంలోని ఓ వీధి

పొదలకూరు : పొదలకూరు మేజర్ పంచాయతీలో ఇంటి చిరునామాలను గుర్తించాలంటే పాత పద్ధతులను వాడాల్సిందే. కొండగుర్తుల ప్రకారం వెళ్లాల్సి వస్తోన్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఈ పంచాయతీలో ఇంటి నంబర్లను కేటాయించలేదు. ఓటరు జాబితాలో ఉన్న నంబర్లనే పంచాయతీ నిర్వాహకులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఫలితంగా కొత్త వారు చిరునామాలు తెలుసుకోవాలన్నా, పార్శిల్ సర్వీసులు, పోస్టల్ శాఖ నుంచి వస్తువులు, ఉత్తరాలు రావాలన్నా ల్యాండ్ మార్క్‌గా బడో, గుడో చెప్పాల్సి వస్తోంది. పంచాయతీలో చిరునామాలను తెలుసుకోవాలంటే వీధులకు పెట్టిన మనుషుల పేర్లు, పాత పద్ధతిలో దేవస్థానాల పేర్లను చెబితేనే సంబంధిత కొత్త వ్యక్తులు ఇళ్లకు చేరుకునే పరిస్థితి ఉంది.

ఎన్ని కుటుంబాలంటే..

పంచాయతీలో మొత్తం 18 వార్డులు (లింగంపల్లి, చిట్టేపల్లి గ్రామాలు కలిపి) ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 16,662 మంది ఉన్నారు. ఇందులో 8,225 మంది పురుషులు, 8,437 మంది మహిళలు ఉన్నారు. 4,230 కుటుంబాలున్నాయి. పెరిగిన జనాభా ప్రకారం ప్రస్తుతం 18,500 పైచిలుకు జనాభా, 5,500 పైగా కుటుంబాలు ఉన్నట్టు అంచనా. సర్వేపల్లి నియోజకవర్గంలోనే పొదలకూరు పెద్ద పంచాయతీగా గుర్తింపు ఉంది. అయితే పంచాయతీ నిర్వాహకులు ఇంటి నంబర్లను ఏర్పాటు చేయడంలో వెనుకబడి ఉన్నారు.

ఇంటి నంబర్లకే ప్రాధాన్యత

సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఎక్కడికి వెళ్లినా, ఏ వస్తువు కొనుగోలు చేసినా చిరునామాలో ఇంటి నంబర్ తప్పనిసరైంది. అంతేకాక బ్యాంక్ రుణం పొందాలన్నా, కొత్తగా ఖాతా తెరవాలన్నా, సెల్‌ఫోన్ సిమ్ తీసుకోవాలన్నా ఇంటి నంబర్‌ను అడుగుతున్నారు. ఫలితంగా పొదలకూరు వాసులు ఏదో ఒక నంబర్ చెప్పి ఆ కాలంను పూర్తి చేయాల్సి వస్తోంది. ఇలాంటి ఇబ్బందులను తొలగించుకోవాలంటే పంచాయతీ చొరవ తీసుకుని ప్రాంతాల వారీగా ఇంటి నంబర్లను కేటాయించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం ఉంది. ప్రతి ఇంటికీ అసెస్‌మెంట్ నంబర్లు ఉన్నా అవి చిరునామాకు పనికిరావు. ఓటర్ జాబితాలోని నంబర్లను చిరునామాలకు పరిగణనలోకి తీసుకోవడం లేదు.

మున్సిపాలిటీ విషయంలో..

పొదలకూరు పంచాయతీ మున్సిపాలిటీకి చేరువలో ఉంది. పక్కనున్న మైనర్ పంచాయతీలను కలిపితే జనాభా పెరిగి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. అలా రూపాంతరం చెందితే ఇళ్ల పన్నులు, రిజిస్ట్రేషన్ల వాల్యూ పెరగడం తదితరాలుంటాయి. దీంతో పొదలకూరును మున్సిపాలిటీ చేసే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. గతంలో మున్సిపాలిటీ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. పంచాయతీలో ఇంటి నంబర్లను కేటాయించాలంటే పంచాయతీరాజ్ కమిషనర్ అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రతి పదేళ్లకొక పర్యాయం నంబర్లను మార్చడం జరుగుతుంది. ప్రస్తుతం కమిషనర్ అనుమతి లభించిందని, త్వరలో ఇంటి నంబర్లను కేటాయించడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.



పంచాయతీ కార్యాలయం (ఫైల్)

ఇంటి నంబర్లు కేటాయించాలి



పొదలకూరు మేజర్ పంచాయతీలో ఇంటి నంబర్లను కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా చేస్తే చిరునామాలు తెలుసుకోవడం సులభంగా ఉంటుంది.

– లక్కాకుల ఆనందరావు, స్థానికుడు, పొదలకూరు

చిరునామాలు తెలుసుకోవడం సులువు



ప్రతి ఇంటికీ ప్రాంతంతోపాటు ఇంటి నంబరు ఉంటే చిరునామా తెలుసుకోవడం సులువుగా ఉంటుంది. పెద్ద పంచాయతీతోపాటు, పట్టణం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంటి నంబర్లు తప్పనిసరిగా ఉండాలి.

– ఆదూరు వెంకటసుబ్బయ్య, స్థానికుడు, పొదలకూరు

త్వరలో నంబర్ల కేటాయింపు



త్వరలో ఇళ్లకు నంబర్లను కేటాయించడం జరుగుతుంది. ఇందుకు సంబంధించిన అన్ని రకాల అనుమతులు తీసుకోవడం జరిగింది. సిబ్బందిని నియమించి నంబర్లను కేటాయిస్తాం.

– ఉగ్గు శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ, పొదలకూరు

ప్రసన్న పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామానికి చెందిన వల్లూరు అశోక్‌రెడ్డి మాతృమూర్తి సులోచనమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యుల్ని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అలాగే పంచేడు గ్రామానికి చెందిన సూరా ప్రతాప్‌రెడ్డి మాతృమూర్తి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం నగర, రూరల్ కన్వీనర్లు షేక్ షాహుల్, చెర్లో సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు శ్రీనివాసులురెడ్డి, చిల్లకూరు శ్రీనివాసులురెడ్డి, అన్వేష్, అశోక్, కృష్ణారెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేయడం సరికాదు



మాట్లాడుతున్న కార్మికులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగులరాట్నాలు ఏర్పాటు చేసిన కార్మికులకు నగదు ఇవ్వకుండా నిర్వాహకుడు మణి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు గురువారం వాపోయారు. ఈ మేరకు వారు గురువారం బుచ్చి పట్టణంలో మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన తమను నగదు ఇవ్వకుండా మోసం చేయడం సరికాదని తెలిపారు. స్థానిక అధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

పొదలకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఓ విజయవరకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా వివరించారు. మంటలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం

మనుబోలు: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని పడమటివీధి, కోదండరామపురంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ స్వామికి వివిధ పూజలు చేశారు. అనంతరం సీతారాములకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా ఉచ్చూరు లక్ష్మణరెడ్డి, తనూజ, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, రాజేశ్వరమ్మ వ్యవహరించారు. పడమటి వీధిలో కల్యాణం అనతరం సీతారాముల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



గజవాహనంపై సీతారాముల విహారం

గీతాంజలిలో రక్తదాన శిబిరం



కోవూరు : గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 300 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి ఇచ్చినట్లు తెలియజేశారు.

బీజేపీ నేతల సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు బీజేపీ ఆలోచనలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రామిశెట్టి కల్యాణ్‌కుమార్, గడ్డం విజయ్‌కుమార్, కాసా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఏకరువు



సమస్యలపై ప్రశ్నిస్తున్న సభ్యులు

కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సభ్యులు గళమెత్తారు. యల్లాయపాళెం పీహెచ్‌సీలో రాత్రి వేళల్లో వైద్యం అత్యవసరమైతే ఎవరూ అందుబాటులో ఉండడం లేదని, ఒక డాక్టర్ ఉండేలా చూడాలని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కోరారు. అనేక చోట్ల విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా కిందకు వేలాడుతున్నాయని, ఈ సమస్యపై అనేక పర్యాయాలు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు ఫిర్యాదు చేశారు. పాతవంగల్లులో తాగునీటి కుళాయిలు లేనందున ఇబ్బంది పడుతున్నట్లు సభ్యులు తెలిపారు. గౌతమ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చాలని సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్సీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా మరో రూ.50 వేలు ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా కోరారు. అనంతరం ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ మండలంలోని గ్రామాలన్నీ అభివృద్ధి చెందాలంటే అన్నిశాఖల అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు, తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాతమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



మనుబోలు: ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు



పొదలకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని కాగితాలపూరు దళితవాడ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు విజయమ్మ, గౌరీ, రేవతి, మహాలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు: గర్భిణులు సాధారణ ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురంలో గురువారం తల్లులు, అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, రాజేశ్వరి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న జిల్లా పకృతి వ్యవసాయ శాఖ అధికారి చంద్ర

కలువాయి(సైదాపురం): ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి చంద్ర, ఎంటీ సుహర్లత తెలిపారు. కలువాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం సాధికార సంస్థ, ఏపీ ప్రజారోగ్యం, ప్రకృతి వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ – 2025లో భాగంగా పొదుపు మహిళలు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అలాగే డక్కిలి మండలం డి.ఉప్పరపల్లి యూనిట్‌లో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వీఓఏలు, పొదుపు సిబ్బంది పొదుపు గ్రూపు సభ్యులను సమన్వయం చేసుకుని సెంటు నుంచి 5 సెంట్ల భూమిలో ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు. రైతులు తమ పొలాల్లో 20 రకాల నవధాన్యాల విత్తనాలు సాగు చేసి కలియదున్నాలని సూచించారు. తద్వారా భూమి సారవంతమవుతుందని, అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఎంసీఆర్పీ పెంచలయ్య, ఎల్–2 రజని, కవిత, నారాయణ రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు: అంబేడ్కర్ ఆశయాల సాధనకు సమైక్యంగా కృషి చేద్దామని ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య పిలుపునిచ్చారు. నార్తురాజుపాళెంలోని ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీహరి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.పుట్టయ్య, పి.తిరుపాలు, జిల్లా కార్యదర్శులు ఖాజావలీ, ఆర్.శైలజ, మండల నాయకులు సి.మోహన్‌రావు, తాటిపర్తి వెంకటేశ్వర్లు, ఖాజా మస్తాన్, గౌస్‌బాషా, కీర్తన పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శ్రీకారం

- నవమి వేడుకల్లో ఉభయకర్తల తీర్మానం
- త్వరలో కార్యరూపం



పట్టణంలోని రామమందిరం

పొదలకూరు: శ్రీరామనవమి వేడుకల్లో ఓ బృహత్తర కార్యక్రమానికి ఉభయకర్తలు, భక్తులు శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా ఉన్న రామమందిరం శిథిలమై పోతుండటంతో దాని స్థానంలో సీతారాముల ఆలయం నిర్మించేందుకు సంకల్పించారు. ఇందుకోసం గ్రామపెద్దలు తీర్మానం చేసి భక్తులతో మాట్లాడారు. అందరూ ముక్తకంఠంతో రామయ్యకు దేవాలయాన్ని నిర్మించుకుందామని వెల్లడించారు. ఫలితంగా దాతలు రూ.14.50 లక్షల విరాళాలను ప్రకటించారు.

దశాబ్దాల చరిత్ర

పట్టణంలోని రామమందిరానికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1936లో రామానుజం శెట్టి దీని నిర్మాణానికి పూనుకున్నారు. అంతకుముందు పూరికప్పులో సీతారాముల పటాలను ఏర్పాటు చేసి భజనలు చేసేవారు. తర్వాత రామానుజం కృష్ణయ్య పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించేవారు. దశాబ్దాలుగా అక్కడ నవమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించేవారు. అప్పట్లో పొదలకూరు అంటే రామమందిరం చుట్టుపక్కల ఉన్న ఇళ్లేనని అంటుండే వారు. ఇక్కడే పెద్దఎత్తున వ్యాపారాలు సాగేవని పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుతం రామమందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో ఉభయకర్తలు, భక్తులు కలిసి ఆలయాన్ని నిర్మించేందుకు సంకల్పించుకున్నారు. ఫలితంగా మూడురోజుల క్రితం సమావేశం నిర్వహించి కార్యాచరణను రూపొందించుకున్నట్టు తెలిపారు. ఉన్న చిన్నపాటి స్థలంలోనే సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలు వెచ్చించి నిర్మించుకోవాలని తీర్మానంలో పొందుపరచారు. ఇందుకోసం దశాబ్దాలుగా ఉభయకర్తలుగా ఉన్న కుటుంబాల వారు సమ్మతించారు.

రామాలయం నిర్మిస్తాం



అందరి సహకారంతో రామాలయం నిర్మించడం జరుగుతుంది. ఉభయకర్తలు, భక్తులు ముందుకొచ్చారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం రోజున నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. శిథిలావస్థకు చేరుకున్న రామమందిరంలోనే చాలా ఏళ్లుగా పూజలు నిర్వహిస్తున్నాం.

– కోనం చినబ్రహ్మయ్య, ఉభయకర్త, పొదలకూరు

దశాబ్దాల కల



దశాబ్దాలుగా రామాలయాన్ని నిర్మించాలని అనుకుంటున్నాం. రామమందిరం బాగా శిథిలావస్థకు చేరుకుంది. మా పెద్దల నుంచి పార్వేట ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నాం. ఆలయ నిర్మాణానికి మావంతు సహకారం అందిస్తాం.

– తుమ్మల ప్రసాద్, ఉభయకర్త, పొదలకూరు

సహకారం అందిస్తా



సీతారాముల కల్యాణం రోజునే ఆలయ నిర్మాణానికి సంకల్పించడం జరిగింది. అంతకుముందు మూడేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. సమావేశం నిర్వహించి నిర్మాణానికి తీర్మానం చేయడం జరిగింది. నావంతు సహకారం అందిస్తా.

– ఆదూరు వెంకటసుబ్బయ్య, భక్తుడు, పొదలకూరు